క్లుప్తంగా

వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి కి వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ నాయకులు

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ వసతి గృహాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పూరి కుమార్, రాష్ట్ర నాయకులు బీరెల్లి రజినికుమార్, ముప్పూరి రవి శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కలిసి తన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వసతి గృహాల సమస్యలు పరిష్కరించి జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని కాచిగూడ హాస్టల్ వెంటనే ఓపెన్ చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిచి సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. న్యూ నాగోల్ కాలనీ రోడ్ నం:9లో కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఏఈ మాతృనాయక్‌తో కలిసి పరిశీలించారు. రోడ్డు పనుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా లెవెల్స్ సరిచూసుకోవాలని వర్షపు నీళ్లు ఆగకుండా స్లోప్ చూసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎనుముల మాధవరెడ్డికి నివాళి



చంపాపేట: సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఎనుముల మాధవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన దశదిన కర్మను స్థానిక సామ నర్సింహారెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంతరెడ్డి, కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి, రఘుమారెడ్డి, రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు హాజరై మాధవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాధరెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

దిల్‌సుఖ్‌నగర్: ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో జగన్నాథ రథయాత్ర మహోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. వందలాది భక్త జనం ఎంతో ఉత్సాహంగా రథయాత్రలో పాల్గొన్నారు. రథ ఊరేగింపు వాసవి ఆధ్యాత్మిక కేంద్రం నుంచి మొదలై అష్టలక్ష్మి ఆలయం మీదుగా వెళ్లి కాలనీలలో తిరిగి ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకుంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం భగవద్గీత క్లాసులు జరుగుతాయని నిర్వాహకులు శ్రీనివాస్ అతిప్రియ దాసు చెప్పారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ గుప్తా, చిలుక ఉపేందర్ రెడ్డి, అంజయ్య, శ్రీధర్, రాజ్యలక్ష్మి, మురళీగోపినాథ్ దాస్, లీలాశుఖ దాస్, మాయ నర్సింగ్ రావు, శశాంక్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య

హయత్‌నగర్: అప్పుల పాలయిన ఓ వ్యాపారి హోటల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భీమవరానికి చెందిన గొట్టిముక్కల నాగరాజు(44) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నగరంలోని కొంపల్లిలో నివసిస్తూ డ్రైఫ్రూట్స్ వ్యాపారం చేస్తున్నాడు. కొంత కాలంగా వ్యాపారంలో నష్టం రావడంతో సుమారు రూ.70 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో మూడు రోజుల క్రితం హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీలో ఉన్న ఓయో హోటల్లో దిగాడు. శనివారం ఉదయం 6:30 గంటలకు తాను చనిపోతున్నానని, తన కుటుంబసభ్యులను చూసుకోవాలని హోటల్ గది నుంచి తన సోదరునికి ఫోన్ ద్వారా మెసేజ్ పెట్టాడు. వారు హోటల్‌కు సమాచారం ఇవ్వగా హోటల్ వారు గదిని తెరిచి చూడగా అప్పటికే నాగరాజు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనం.. సహారాస్టేట్స్ కాలనీ సొంతం

మినీ ఇండియాగా సహారా కాలనీ

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి డిమాండ్

మన్సూరాబాద్: పచ్చని చెట్లు, చూట్టూ పచ్చిక బయళ్లతో హరితవనాన్ని తలపిస్తూ కాలనీ అంతా పచ్చగా కనిపిస్తుంది. విభిన్న రకాల మతాలు, కులాల మిశ్రమంతో మినీ ఇండియాగా తలపిస్తుంది. చిన్నా, పెద్ద, పేద, ధనిక భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు నివసిచేందుకు అందుబాటులో ఉంటుంది. అంతా స్నేహపూర్వకంగా కలిసి మెలసి నివసించే ప్రాంతమే మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్‌కాలనీ. సుమారు 47 ఎకరాల్లో 1500 నివాస గృహాలు, 7 వేల జనాభాతో చూట్టూ ప్రహరీతో గేటెడ్ కమ్యూనిటీతో 2001లో ప్రారంభమైన కాలనీ గత 22 సంవత్సరాల నుంచి ఆధునిక జీవనానికి అనుగుణంగా మార్పులు చేసుకుంది.



సహారాస్టేట్స్‌కాలనీలో పచ్చదనంతో నిండిన కాలనీ పార్కు

విశాలమైన రోడ్లు..

విశాలమైన రోడ్లు, రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లతో అలరారే పచ్చిక బయళ్లతో పచ్చదనాన్ని పంచుతుంది. శుభకార్యాలు నిర్వహించుకునేందుకు క్లబ్, కమ్యూనిటీహాల్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, పార్కులు, షాపింగ్ కాంప్లెక్, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన నిరంతర సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులు పచ్చదనంతో నిండిపోయి ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీవాసులు సేదతీరుతుంటారు. వాకర్స్‌కు, సాయంత్రం సమయంలో చిన్నారులు హాయిగా ఆడుకోవటానికి ఉపయోగకరంగా ఉన్నాయి. పచ్చని బయళ్ల మధ్య కాలనీవాసులు ఆనందోత్సవాలతో కబుర్లు చెప్పుకుని, ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పాలు పంచుకుంటారు.



వీటికి చెక్ పెట్టాలి..

- అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్లను వెంటనే పూర్తిచేయాలి.
- వివేకానందనగర్‌కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ మురుగు కల్యాణి బ్లాక్‌ను ముంచేత్తుతుంది.
- పై కాలనీల నుంచి వచ్చే ట్రంక్‌లైన్ కాలువ ఓపెన్‌గా ఉండటంతో బృందావన్ బ్లాక్ వైపు ఉన్న నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు.
- జీహెచ్‌ఎంసీకి ఇంటి పన్నులు చెల్లిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీ పేరుతో సౌకర్యాలు కల్పిచడం లేదు.

ఇబ్బందులు పడకుండా చర్యలు



సహారాస్టేట్స్‌కాలనీలో కాలనీవాసులు ఇబ్బందులు పడకుండ అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. కాలనీలోని రోడ్లన్ని దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి సహకారంతో కొన్ని రోడ్లు వేయటం జరిగింది. నిర్వహణ భారం కాలనీవాసులపై పడుతుంది. పై కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగుతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

– కరణం శ్రీకాంత్, కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు

మరిన్ని వసతులు కల్పించాలి



జీహెచ్‌ఎంసీకి క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాం. అయినా గేటెడ్ కమ్యూనిటీ కాలనీ పేరుతో కనీస వసతులను కల్పించడం లేదు. జీహెచ్‌ఎంసీ వీధి దీపాలు, పారిశుద్ధ్య లాంటి కనీస సౌకర్యాలు కల్పిస్తే కాలనీవాసులపై కొంత మేర భారం తగ్గుతుంది. పై కాలనీ నుంచి డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఓపెన్‌గా ఉండటంతో బృందావన్ నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు జీహెచ్‌ఎంసీపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయించాలి.

– పార్థసారథి– కాలనీ మెయింటనెన్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

హస్తినాపురం: హస్తినాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హస్తినాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సుధీర్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలని, భీమానగర్‌లో నిలిచిపోయిన డ్రైన్ పనులను వెంటనే ప్రారంభించి పనులను త్వరితగతిన పూర్తయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వినోద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తెలంగాణ అమరుల త్యాగాలు మరువలేనివి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

మలక్‌పేట: తెలంగాణ అమరుల త్యాగాలు మరువలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. జూలై 2న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్విజ్ పోటీల్లో ప్రధానంగా తెలంగాణ ఉద్యమం, విద్యార్థుల పాత్ర, సకలజనుల సమ్మె లాంటి ప్రధాన ఘట్టాలపై పోటీ ఉంటుందన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీలలో క్విజ్ పోటీల కరపత్రాలు పంచిపెట్టి ప్రచారం చేశారు. ఆసక్తి గల వారు జూలై 1 తేదీలోగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్ పొందడానికి ఆసక్తి కలిగిన వారు 7661 899 899కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తా

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఎన్జీఓస్‌కాలనీలోని లేబర్ అడ్డా వద్ద పగిన డ్రైనేజీ పైప్‌లైన్ వల్ల మురుగునీరు రోడ్లపై పారడంతోందని కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు జలమండలి అధికారులతో కలిసి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేయాలని జలమండలి అధికారులను కోరారు. డివిజన్లలో ఎక్కడెక్కడ మురుగునీటి సమస్య ఉందో వెంటనే అధికారులు గుర్తించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ భవ్యారెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



మురుగునీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్

పేదల సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

నాగోలు: పేదల సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ధ్యేయమని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం రాత్రి నాగోలులోని అనంతుల రామ్‌రెడ్డి గార్డెన్స్‌లో బీజేపీ ఆధర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి చేసిందని అందుకోసం ప్రగతి నివేదికల కోసం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ట్విట్టర్ టిల్లు కేటీఆర్.. ట్విట్టర్‌లో రెచ్చిపోతాడు తెలిపారు. మిగులు రాష్ట్రాన్ని 5 లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత కేసీఆర్ దని తెలిపారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరిట తెలంగాణ దగా చేస్తున్న పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో దళిత బంద్ తీసుకు వచ్చాని ఇప్పుడు ఎన్నికల వస్తున్నాయని బీసీ బంద్ తీసుకోస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ బీజేపీ రాష్ట్ర నాయకులు కటకం నర్సింహరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామల, బీజేపీ కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, రంగ నర్సింహగుప్తా, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాద సమాఖ్య ఎన్నిక ఏకగ్రీవం



రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లాకోర్టు న్యాయవాద సంఘం అధ్యక్షులు దీకొండ రవీందర్ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు సమావేశమై న్యాయవాదుల రక్షణ, ఇతరాత్రా హక్కుల నిమిత్తం న్యాయవాదుల సమాఖ్యకు సంబంధించిన ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సమాఖ్య స్థాపకుడు విష్ణువర్ధన్ రెడ్డి, అధ్యక్షుడిగా నాంపల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కిరణ్, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా రంగారెడ్డి న్యాయవాద సంఘం అధ్యక్షులు దీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మల్కాజ్‌గిరి న్యాయవాద సంఘం అధ్యక్షులు రాంచద్రారెడ్డి, కోశాధికారిగా పట్లోళ్ల మాధవ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పాఠశాలలో స్కార్ఫ్ వివాదం

పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు

హయత్‌నగర్: స్కార్ఫ్ (ముఖానికి వేసుకునే ముసుగు లాంటిది) ధరించరాదని పాఠశాల ఉపాధ్యాయులు ఓ విద్యార్థినిపై ఒత్తిడి తెచ్చారనే కారణంగా ప్రధానోపాధ్యాయురాలితో పాటు ముగ్గురు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని, తన తోటి విద్యార్థినితో కలిసి ఈనెల 22న స్కార్ఫ్ ధరించి పాఠశాలకు వెళ్లారు. ఉపాధ్యాయులు స్కార్ఫ్ తీసివేయాలని వారిపై ఒత్తిడి తెచ్చారు. స్కార్ఫ్ ధరించాలంటే ప్రిన్సిపాల్ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థిని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారి సలహా మేరకు విద్యార్థిని శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకరించాలి

సైదాబాద్: దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని, అలాంటి దేవాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. శనివారం సైదాబాద్ డివిజన్ గడ్డిఅన్నారం చౌరస్తాలోని నల్లపోచమ్మ దేవాలయం పునర్నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని హరిగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆదరణలేకపోవడంతో, ప్రకృతి వైపరిత్యాల కారణంగా పలు ఆలయాలు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. తన దృష్టికి వచ్చిన అలాంటి ఆలయాలకు పునర్ వైభవం తెచ్చేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగౌడ్, దర్శన్, చంద్రకాంత్‌గౌడ్, రామకృష్ణ, సునీల్, హన్మంత్, శ్రీను పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్

సర్కిల్–3 డీసీ ఈఆర్‌ఓ మారుతీదివాకర్



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియతోపాటు ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువగా ఉన్న ఇండ్లు అపార్టుమెంట్లకు సంబంధించిన వెరిఫికేషన్ (సర్వే) పకడ్బందీగా జరుగుతోందని ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ, ఈఆర్‌ఓ మారుతీదివాకర్ తెలిపారు. శనివారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారుగా 13748 ఇండ్లు, అపార్టుమెంట్లతో సుమారుగా 1,48.378 ఓటర్లు ఉన్నారని ఇప్పటికే గుర్తించామి పేర్కొన్నారు. 545 బూత్ లెవల్ అధికారులు ఈ సర్వేలో పాల్గొంటున్నారని, ఇంటింటికీ తిరుగుతూ ఈ సర్వే చేస్తున్నారని తెలిపారు. ఒకే ఫొటో కలిగి రెండు మూడు ఓటర్లు ఉన్నవారిని ఇప్పటికే గుర్తించామని వాటిని తొలగించేందుకు డిక్లరేషన్ తీసుకుని తొలగించాలని బీఎల్‌ఎలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ముఖ్యంగా ఒకే ఇంట్లో ఆరుకుపైగా ఓటర్లు ఉన్నవారిని గుర్తించిన తర్వాత వారు అదే ఇంట్లో ఉంటున్నారా? లేక ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారా? అనే విషయంపై స్పష్టంత తీసుకున్న తర్వాత బోగస్ ఓట్లు ఉంటే తనకు రిపోర్టు చేయాలని తెలిపారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించండంతోపాటు వేరే ప్రాంతంలో ఓట్లు ఉంటే వారిని గుర్తించి తొలగించాలని సూచించారు.

ఆరుకంటే ఎక్కువగా ఓట్లు ఉంటే బై నంబర్ ఇవ్వాలి..

ఒకే ఇంట్లో ఆరుకంటే ఎక్కువగా ఓట్లు ఉంటే వారిని గుర్తించి వారంతా అక్కడే నివాసముంటున్నారా? లేదా? అనే విషయంపై సర్వే చేయాలని కోరారు. ఒక వేళ అరుగురు కంటే ఎక్కువగా ఉంటే అదే ఇంటిపైన బై నంబర్ ఇచ్చి ఆ ఓట్లను కొనసాగించాలని సూచించారు. బోగస్ ఓట్లు ఉంటే వాటిని తొలగించేందుకు సదరు ఇంటి యజమాని నుంచి స్వయంగా డిక్లరేషన్ తీసుకున్న తర్వాత వాటిని తొలగించనున్నామని మారుతీదివాకర్ తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో చేసుకోవాలని చేసుకున్న తర్వాత బూత్‌లెవల్ అధికారులు ఆ ఓట్లను వెరిఫికేషన్ చేసిన తర్వాత కొత్త ఓటరుగా నమోదు ప్రక్రియ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



సువార్త మహా సభల్లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ది పెంతకోస్తు మిషన్ చర్చి పాస్టర్ శ్యామ్ సుందర్ అన్నారు. ఓల్డ్ మలక్‌పేట వాహేద్‌నగర్‌లో ఉన్న చర్చిలో మూడు రోజులు జరిగిన సువార్త మహాసభలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ.. మంచి మనసు, సహృదయంతో జీవనం కొసాగించాలన్నారు. పగ, ఈర్ష్య, కోపం వంటివి మానవ మనుగడకు ప్రమాదమన్నారు. అనంతరం పరుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్వాయర్ టీమ్ స్తుతి పాటలతో ప్రభువు ఆరాధించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ శరవనణ్, జరూసలేం మత్తయి, చర్చి బాధ్యులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

లారీల అడ్డాను తరలించాలి

వనస్థలిపురం: జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద ఉన్న ఇసుక లారీల అడ్డా తరలింపునకు సహకరించాలని కోరుతూ వనస్థలిపురం తూర్పు కాలనీల సంక్షేమ సఘం సభ్యులు శనివారం తెలంగాణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నందారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గుత్తా లక్ష్మణ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ఆటోనగర్ సమీపంలోని ఇసుక, ఇటుక లారీల వల్ల ఏర్పడుతున్న దుమ్ము, ధూళితో వనస్థలిపురం తూర్పున ఉన్న 21 కాలనీల ప్రజలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, కే.ఎల్.నర్సింహరావు, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్‌సింగ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

పైకప్పు కూలి ముగ్గురుకి గాయాలు



పరామర్శిస్తున్న రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ మున్సిపల్ కాలనీలో శుక్రవారం రాత్రి సమయంలో ఓ ఇంటిపై కప్పు పెచ్చులు ఊడిపడటంతో ఇంటి యజమాని రంగయ్య, భార్య బిందు, మూడేళ్ల కుమారుడు గౌతంకు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి మున్సిపల్ కాలనీకి చేరుకుని గాయపడ్డ ముగ్గురిని పరామర్శించారు. ఉప్పల్ తహసీల్దార్‌తో మాట్లాడిన ఆయన నష్టాన్ని అంచనా వేసి తగు నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. మున్సిపల్ కాలనీ మాజీ అధ్యక్షుడు భాస్కర్, చిన్నయాదవ్, ఈశ్వర్‌గౌడ్, మల్లేష్, రాము పవన్, వీరన్నయాదవ్, గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



చాదర్‌ఘాట్: నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మలక్‌పేటలోని తిరుమల బ్యాంక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంక్ సిబ్బంది వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం సినీ హీరో సుమన్ బ్యాంక్ వినియోగదారులకు ఏటీఎం కార్డులను అందజేశారు.

ఇంటి ముందు చెత్త వేశారని ఇద్దరిపై దాడి

మలక్‌పేట: ఇంటి ముందు చెత్త వేశారని ఓ అడ్వకేట్ ఇద్దరి దాడి చేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసారంబాగ్‌కు చెందిన హైకోర్టు అడ్వకేట్ ఆంటోనిరెడ్డి నివాసముంటున్న బిల్డింగ్‌లో శుక్రవారం పక్కంటి వారు ఇంటి ముందు చెత్త వేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆంథోనిరెడ్డి పక్కంటి మహిళ(54)పై చెయ్యి చేసుకున్నాడు. అడ్డు వచ్చి మరో వ్యక్తిని కొట్టాడు. దీంతో వారు మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్‌చేశారు.. పోగొట్టుకున్న ఫోన్లు అప్పగించారు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 32 ఫోన్లను పోలీసులు ట్రాక్‌చేసి యజమానులకు అప్పగించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి వివరాల ప్రకారం..సీఈఐఆర్ (సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్) పోర్టల్‌లో కనిపించకుండా పోయిన లేదా దొంగతనాకి గురైన మొబైల్ ఫోన్లను ట్రాక్ చేయవచ్చు. ఆ మొబైల్ ఫోన్లను ఎవరైనా వాడుతున్నా ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చునని తెలిపారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి గురైన 32 మొబైల్ ఫోన్లను క్రైమ్ టీం వారంలోగా సీఈఐఆర్ పోర్టల్ సాంకేతికత సాయంతో గుర్తించారు. చోరి గురైన ఫోన్లను కొనుగోలు చేసిన వారి నుంచి స్వాధీనం చేసుకుని శనివారం యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఫోన్ల యాజమానులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



సెల్‌ఫోన్లు వారితో ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసిన షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులను డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొాద్రీ సొసైటీకి చెందినదిగా చెప్పుకునే వివాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని అయితే ఇటీవల ఒక నిర్మాణ సంస్థ అక్కడ అక్రమంగా కట్టడాలు నిర్మాంచడానికి సన్నాహాలు చేస్తుందని వివరించారు. రోజూ పదుల సంఖ్యలో ఇక్కడికి లారీలు వచ్చి పోతుండటంతో గుడిసెవాసులు రోడ్డు దాటడం కూడా కష్టమవుతుందని అన్నారు. సింగరేణి కాలనీ గుడిసెవాసులను ఇబ్బందులకు గురి చేస్తూ కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి సాగిస్తున్న కట్టడాల విషయమై రెవిన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేసామన్నారు.